# కన్న కడుపు

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

"ప్రతీ స్త్రీ పేరుకీకూడా "అమ్మ" అనే మాట చేరుస్తారు. చిన్నపిల్లలను ముద్దులాడడముకూడా "అమ్మా" అనే. ఆమధురమైన మాటొక్కటే మనదేశంలో స్త్రీలపై మాతృభావాన్ని నెలకొల్పింది."

శ్రీనివాసుడు వాళ్లింట్లో చాలా ముద్దుగా పెరిగేడు. వాళ్లకు కావలసినంత ఆస్తుంది. శ్రీనివాసుడు చేసే ఏపనిలోనూ కూడా తల్లి లచ్చమ్మ, అన్న, తండ్రీ ఎవ్వరూకూడా అడ్డుతగిలేవారు కారు.

ఆరోజు ఒక పెండ్లిసంబంధము వచ్చింది. అంతా నిశ్చయం అయింది. కాని, ఏంలాభం. శ్రీనివాసుడు నిరాకరించేడు. ఇదేకాదు. వస్తూన్న సంబంధాలన్నిటికీ కూడా ఇదేగతి. కారణం అతనికీ తెలీదు, ఎవ్వరికీ తెలీదు. అతని మనస్సులో ఉండే కలతగాబోలు అతనికి ఇంట్లో ఎంతముద్దుగా జరుగుతోందో కూడా తెలిసేదికాదు. రోజూ ఆలోచిస్తూ నాలుగుప్రక్కలా చూచేవాడు. "ఈ ఇల్లునాదికాదు, ఈ ఇంట్లో నాకేమీలేదు. నాసర్వస్వము ఎక్కడో దాగిఉంది. అదే నాజీవితం,—ఇక్కడేమీలేదు." అనుకుంటూండేవాడు. చీకట్లో పనిమీదవస్తూ అక్కడ నిలబడిపోయి ఆలోచించేవాడు, లచ్చమ్మవచ్చి మందలించేది. భోజనంకూడా సరిగ్గా చేసేవాడుకాదు. ఆమన్నాడు మద్రాసని బయలుదేరాడు.

తానెక్కిన పెట్టిలో ఎవ్వరూలేరు. అదొక ఖైదులా గనిపించేది. కిటికీలోంచి పైకిచూచేవాడు. ఆ చీకట్లో తనకోసం ఎవ్వరో పరుగెత్తుకొని వస్తున్నారనుకొనేవాడు. నాలుగైదు రోజులక్రిందవిన్న సంగతులన్నీ ఒక్కసారి తలపుకు వచ్చాయి,

మన్నాడు, తాను చేరవలసిన మద్రాసు కాదు, హైదరాబాదు చేరేడు. ఆరోజు సాయంత్రం ఒక ఇంటిముందు నిలచి, లోపలికి కబురు పంపేడు, రాజమండ్రినుంచి గౌరీపతి శాస్త్రిగారి కుర్రాడు వచ్చాడని. లోపలికి రమ్మని కబురువచ్చింది. లోపల ఎవ్వరు లేరు, కొంతసేపటికి, ఒక మహమ్మదీయ స్త్రీ లోనుండి వచ్చి అతని ప్రక్కనే నిల్చుండి, అతన్ని దీర్ఘంగా చూచింది. అలా చూస్తుండగానే ఆమె కళ్లంట నీళ్లు కారడం ప్రారంభించాయి. "ఎన్నాళ్లకు, కనబడ్డావురా, నాయనా," అని నిట్టూర్పు పుచ్చింది. ఆమెని చూడగానే శ్రీనివాసుని హృదయం ఒక్కసారి ప్రేమతో పైకి పొర్లింది. కనుకొనలలో నీళ్లు గిర్రున తిరిగాయి. మాట్లాడలేక "అమ్మా" అన్నాడు. ఆమె అతనిప్రక్కకివచ్చి కూర్చుంది. ఆమె అతని తలమీద చెయ్యివేసి అనురాగంతో ముద్దుగా "నాయనా, మొన్న కబురు పంపేను, వాడుచెప్పేడా?" అన్నాది. "లేదమ్మా, ఏమీ తిన్నగా చెప్పలేదు. నాకేమీ తెలీదు." అన్నాడు. "ఇంట్లో ఏమని చెప్పివచ్చావు, ఎలా రానిచ్చారు" అని ప్రశ్నించింది. "మద్రాసు వెళ్తానని చెప్పివచ్చాను. ఈసంగతి విన్నదగ్గరనుంచి నిన్నుచూస్తేకాని నామనస్సుకు శాంతి లేకపోయింది." అన్నాడు శ్రీనివాసం. "అయ్యో, నాయనా, మన ఖర్మం ఇలాఅయింది కాని, లేకపోతే నిక్షేపంలాగుందుము. మీనాయనగారు నవాబుగారు వద్ద దివానుగా ఉండేవారు. హటాత్తుగా పగవారువచ్చి కోటమీద పడ్డారు. పట్నాన్ని అల్లకల్లోలం చేసారు. అప్పుడు నువ్వు 6 నెల్లవాడివి. గౌరీపతి శాస్త్రిగారు మీనాన్నగారి దగ్గర గుమస్తాగా ఉండేవారు. ఆయనకి నిన్నప్పజెప్పి మేమంతా మరోకోటకి వెళ్లిపోయాము. అల్లరి ముగిసింది. మేము మళ్ళీ యథాప్రకారంగా వచ్చేశాము. గౌరీపతి శాస్త్రిగారు మాత్రం, నిన్ను తీసుకొని రాజమండ్రీ వెళ్ళిపోయారు. నీతరువాత ఇద్దరు ఆడపిల్లలు కలిగారు. అప్పుడు మీనాయనగారికి జబ్బుచేసి చనిపోయారు..."అని కంటతడి పెట్టుకుంది. ఆమె మళ్ళీ, రెండు మహమ్మదీయ పేర్లు పిలచింది. ఇద్దరు బాలికలు వచ్చారు. "ఇదుగో, నాయనా, నీ చెల్లెళ్లు" అని ఆతడి దగ్గరగాపంపి "మీ అన్నయ్య" అని వాళ్లతో చెప్పింది. శ్రీనివాసుడు వాళ్లిద్దరినీ దగ్గరగా తీసుకొని, వాళ్ల తలమీద ముద్దెట్టుకున్నాడు. వాళ్లని ఎంత ముద్దులాడినా ఆతడి తనివితీరలేదు. వాళ్లని ముద్దుగా "చదువుతున్నారా" అని అడిగేడు. వాళ్లు "ఆ, చదువుతున్నాము" అని తలఆడించారు. "హాయి, వాళ్లగొంతుక ఎంత మధురంగా ఉంది. వాళ్ల ముఖాలు ఎంత ముద్దుగా ఉన్నాయి." అనుకొంటు

న్నాడు గాబోలు: ఆరోజు ఆతడికి క్రొత్త జీవితం అనిపించింది. పైని చీకటి పడకుండానే వెన్నెల వచ్చింది.

నాలుగురోజులు గడిచాయి. శ్రీనివాసుడు ప్రయాణ మయ్యేడు. ఆమె వెళ్లొద్దని బ్రతిమాలింది. చెల్లెళ్ళుకూడా "ఉండిపో, అన్నా ఇప్పుడెక్కడ పోతావు" అని ఆతడిచేతులు పట్టుకు లాగేరు. తప్ప కుండా మళ్ళీవచ్చి ఉండిపోతానని బయలుదేరేడు.

"పల్లెలోగానే వచ్చి తీరాలి వాయునా, ఎక్కడో చోట అందరమూ కలసి ఉండాలి. లేకపోతే నే బ్రతకలేను." అని కంటతడితో చాలా కష్టంమీద వదిలింది. ఆమెని ఓదార్చి బయలుదేరాడాతడు. "హా! హా! ఆమెకు నామీద ఎంత ప్రేమ! అంచేతే అన్నారు తల్లిఋణం తీర్చుకోలేరని." అతడిప్పుడు ఆలోచనలో పడ్డాడు. కన్నతల్లిదగ్గర ఉండిపోవాలి. పెంపుడు తల్లిని వదలలేడు. లచ్చమ్మ, అతనితో తన కొడుకుని, ఇల్లూ వాకలీ వదలిరాదని తెలుసును. రాదు కూడాను. అదే కన్నతల్లయితే, "ఎక్కడోచోట కలసి ఉందాం" మంటుంది. అలాగే ఉంటుంది తారతమ్యం.

ఇలా కొన్నాళ్లు గడిచాయి. గౌరీపతి శాస్త్రి కాలం చేశాడు. ఇద్దరు కొడుకులూ కర్మముగించి లచ్చమ్మని ఓదార్చేరు.

శ్రీనివాసుడు, వాళ్లన్నతోటి, తల్లితోటి చెప్పేడు తాను హైదరాబాదు వెళ్తానని. లచ్చమ్మ గుండె నీరయిపోయింది. వదలలేక ఎడ్చింది. కాని ఏం చేస్తుంది. శ్రీనివాసుడు అన్నతో తల్లిని కనిపెట్టుకుండుమని చెప్పి, తాను తరుచు వస్తుంటాననియు చెప్పి వెళ్లేడు.

హైదరాబాదులో, చెల్లెళ్ళు, తల్లి, అతన్ని ఆహ్వానించేరు. శ్రీనివాసుడు తరచు లచ్చమ్మని చూడ్డానికి వచ్చేవాడు. అప్పుడు లచ్చమ అతడ్ని చేరదీసి, కంటనీరు పెట్టుకొనేది.

# తయారవుతూన్న చిత్రాలు

## వాహినీవారి "సుమంగళి"

వాహినీ పిక్చర్సువారి రెండో సమాజచిత్రం "సుమంగళి" షూటింగు చాలచురుకుగా జరుగుతూంది. డైరక్టరు, కవి, ప్రత్యేకశ్రద్ధతో తయారవుతూన్న యీ "సుమంగళి" "వందేమాతరం"లా ఉత్తమచిత్రం కాగలదనడంలో సందేహంలేదు.

♦♦

## భవానివారి "చండిక"

భవానివారి "చండిక" వడివడిగా తయారవుతూంది. ఈ చరిత్రాత్మక చిత్రం "చండిక" చాలవరకు షూటింగు పూర్తయింది. మార్చిలో తప్పితే ఏప్రిల్ లో విడుదల సిద్ధం.

♦♦

## ఇల్లాలు

ఇండ్రా ఫిలిమ్సువారి "ఇల్లాలు" రామబ్రహ్మం గారి దర్శకత్వాన షూటింగు త్వరితంగా సాగిస్తున్నారు. ఈచిత్రంలో కాంచనమాల ప్రతిభ మీరింత వెలిగిపోతుందని కొత్త ఫక్కీలో పాటలుపాడుతూందని వార్త.

♦♦

## మీరాబాయి

"మీరాబాయి" సత్యశ్రీ ఫిలిమ్సువారు తయారుచేస్తున్నారు. డైరక్టరు భీమవరపు నరసింహారావుగారు. ఈచిత్రం చాల జయప్రదంగా తయారవడానికి పెద్దపెద్ద చేతులుపక్క బలంవుంది: ఇందులో నటీనటులు అందరూ సరి కొత్తవారే.

♦♦

## కాలచక్రం

"కాలచక్రం" శివరాత్రికి విడుదలవుతుందని తెలుస్తూంది. నిజంగా ఈచిత్రం జాతీయచిత్రమే అనిపిస్తూంది.

Printed by B. Nagi Reddy at the B. N. K. Press, 43, Acharappan Street, G. T. Madras, and
Edited and Published by A. N. Raghavachar, No. 32, Krishnappa Naick Tank St., G.T., Madras.